క్లుప్తంగా

తైక్వాండోతో స్వీయరక్షణ



విజేతలను అభినందిస్తున్న రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: తైక్వాండోలో శిక్షణ పొందడంతో స్వీయరక్షణతో పాటు ఆరోగ్యం పెరుగుతుందని, ముఖ్యంగా ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని జిల్లా వాకర్స్ కో ఆర్డినేటర్ అడబాల రత్నప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మంగళవారం అభినందించారు. టైక్వాండోలో పాల్గొనడంతో వలన మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటున్నారు. తైక్వాండో కోచ్ డి.సతీష్ మాట్లాడుతూ తమ పరిమళ టైక్వాండో క్లబ్ ద్వారా 24 మంది పోటీల్లో పాల్గొనగా ఏడుగురికి స్వర్ణ, ఆరుగురికి రజత, ఐదుగురికి కాంస్య పతకాలు లభించాయన్నారు. వాకర్స్ సంఘ కార్యదర్శి దాసరి శ్రీధర్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల తీర్థం



భక్తులకు చీరలు పంపిణీ చేస్తున్న ధర్మకర్త దొరబాబు, సీఐ శ్రీనివాస్

కరప: మండలం సిరిపురం గ్రామ దేవతలైన గోగులమ్మ, మహాలక్ష్మమ్మల తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతల ఆలయం శిథిలం కావడంతో ఐదేళ్ల క్రితం ఆలయ ధర్మకర్త చిక్కాల వీరవెంకటసత్యనారాయణ(దొరబాబు), సుబ్బారావు సోదరులు, గ్రామస్తులు, భక్తులు ఇచ్చిన విరాళాలతో పునర్నిర్మించి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఏటా ఫిబ్రవరి 21న అమ్మవార్ల తీర్థం నిర్వహిస్తున్నారు. ముందురోజు సోమవారంరాత్రి గరగనృత్యాలు, గారడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర నిర్వహించారు. గ్రామదేవతలను దర్శించుకున్న మహిళలకు ఆలయ ధర్మకర్త దొరబాబు సమకూర్చిన ఐదు వేల చీరలను మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, దొరబాబుల కుటుంబ సభ్యులతో కలసి సీఐ కె.శ్రీనివాస్, కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ పంపిణీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతోపాటు, సిరిపురం పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుని, ప్రసాదాలు స్వీకరించారు.

రామకృష్ణ పరమహంస జయంతి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సమితి అధ్యక్షుడు గాంధీ తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక శాంతినగర్‌లోని శ్రీరామకృష్ణా సేవాసమితి ఆడిటోరియంలో మంగళవారం ఉదయం శ్రీరామకృష్ణ పరమహంస జయంతిని సమితి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా విశేష పూజలు చేశారు. భక్తులు రామకృష్ణునిపై కీర్తనలు ఆలపించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీరామకృష్ణ మఠం (విజయవాడ) జాగృతి పేరుతో ఆధ్యాత్మిక అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు గాంధీ, కార్యదర్శి కె.మహాలక్ష్మి, శ్రీరామకృష్ణా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కేఎస్ఎన్ శర్మ, ప్రిన్సిపాల్ కె.అప్పారావు, కె.వెంకట రామశాస్త్రి, కేవీవీఎస్ మూర్తి, సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

కాకినాడ సిటీ: కాకినాడ ఏఎంజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ముగ్గుల పోటీల్లో జిల్లాలోని 18 పాఠశాలలకు చెందిన 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు వేసిన ముగ్గులు విజ్ఞానదాయకంగా, ఆకర్షణీయంగా ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారిణి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ అన్నారు. ఈ ముగ్గులు అధికారులను చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారులు ఆర్‌జేడీ రాజు, ఎం.శ్రీనివాస్ వినీల్, డీఐవీపీజీ వాణికుమారి తదితరులు పాల్గొని విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం వలసపాకలలో మంగళవారం టీడీపీ నాయకులు పర్యటించి మన రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా, పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత సేవ

- ఎన్ఎస్ఎస్ స్ఫూర్తితో ముందడుగు
- స్వచ్ఛ ప్రకృతే లక్ష్యంగా సేవజీవితం
- నేటి చిన్నారుల్లోనూ అవగాహన



సముద్ర తీరాన్ని శుభ్రం చేస్తున్న కృష్ణారావు బృందం



కాకినాడ-సామర్లకోట రహదారి పక్కన కంచె వేసి మొక్కలు సంరక్షిస్తున్న యువత

బాలాజీచెరువు: ఆయనో విశ్రాంత అధ్యాపకుడు. జాతీయ సేవా పథకం జిల్లా కో–ఆర్డినేటర్‌గా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ఆ స్ఫూర్తో ఏమో కానీ 65 ఏళ్ల వయసులోనూ పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అందరినీ చైతన్యపరుస్తూ ఎందరినో సేవాభావం వైపు నడిపిస్తున్నారు. పీఆర్ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడైన డాక్టర్ పాతూరి వెంకట కృష్ణారావు తన శేష జీవితాన్ని ప్రకృతి మాతను స్వచ్ఛంగా ఉంచాలనే ఆలోచనతో ముందుకు సాగిపోతున్నారు. ఆదివారం వస్తే చాలు, ఉదయం 6 నుండి 9 గంటల వరకూ నగరంలో ఏదో ఒక ప్రాంతం లేదా సముద్ర తీరంలో వ్యర్థాలు, చెత్త ఏరివేత వంటి ప్రకృతిసేవ చేస్తుంటారు. సముద్ర తీరం మధ్యలో ఉన్న హోప్ ఐలాండ్ వంటి ప్రాంతాన్ని సైతం సుభ్రపరుస్తుంటారు. ముఖ్యంగా కాకినాడ ఇంద్రపాలెం నుంచి సామర్లకోట వెళ్లే ప్రధాన రహదారి పక్కన కంచె ఏర్పాటు చేసి అనేక రకాల మొక్కలు నాటి నేలతల్లికి పచ్చనిచీర కట్టి మురిసిపోతున్నారు. వీటన్నింటిని డిగ్రీ విద్యార్థులు, ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సంస్థ వంటి సభ్యులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉమ్మడి తూర్పుగోదవారి జిల్లాలో జాతీయ సేవాపథకం కో–ఆర్డినేటర్‌గా పనిచేసిన సమయంలో జిల్లాలో వివిధ కళాశాలలో 200 యూనిట్లు వరకూ ఉండేవి. ఆ యూనిట్ల ద్వారా ప్రత్యేక, వారంతపు శిబిరాలు నిర్వహించి సామాజిక సేవపై అవగాహన కల్పించేవారు. ఆయన హయాంలోనే ఎన్ఎస్ఎస్ శిబిరాలకు అందజేసే రాష్ట్రపతి పురస్కారం ఆంధ్రా, నన్నయ వర్సిటీలు సాధించాయి. ఏటా దాదాపు 100 శిబిరాలు గ్రామాల్లో సైతం వారం రోజుల పాటు నిర్వహించేవారు. ఇటీవలే తన భార్య అన్నవరం సత్యవతీ దేవి మహిళ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన స్వర్ణలత మరణించారు. ఆమె పేరుతో వృద్ధాశ్రమంలో అన్నదానంతో పాటు పీఆర్ జూనియర్ కళాశాలలో తమ తల్లిదండ్రులు పేరుతో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా తన తల్లిదండ్రులు అచ్యుత రామారావు, సీతాయమ్మ పేరుతో రూ.1.5 లక్షలతో కళావేదిక నిర్మించారు. ఇలా తనవంతు సహకారం విద్యకు, ప్రకృతికి అందజేస్తుంటారు.

సామాజిక చైతన్యం కలిగించాలని..



పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై సామాజిక చైతన్యం కలిగించాలనేది నా ఆశయం. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్‌గా దాదాపు ఆరేళ్లు పనిచేశా. బతికి ఉన్నంతకాలం ఈ సేవలు కొనసాగించాలని విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పనిచేస్తున్నాను.

– డాక్టర్ పీపీ కృష్ణారావు, విశ్రాంత ఎన్ఎస్ఎస్ జిల్లాకో–ఆర్డినేటర్

చదువు ముగిసినా సేవ ఆపలేదు



పీఆర్ డిగ్రీ కళాశాలలో 2012లో డిగ్రీలో చేరినప్పుడు ఈయనతో అనుబంధం ఏర్పడింది. ఎన్ఎస్ఎస్‌లో సభ్యునిగా చేరి ఎన్నో కార్యక్రమాలు చేశాం. ఇప్పటికి పదేళ్లు గడిచినా ఆయన చేపట్టే ప్రతి సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటాము.

– పి.రవితేజ, కాకినాడ

మేధో సంపద హక్కులపై సదస్సు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో మేధో సంపద హక్కులు, పేటెంట్ డిజైన్ ఫైలింగ్‌పై ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ హిమాన్షు చంద్రాకర్ పాల్గొని పేటెంట్ అవశ్యకత, డిజైన్ ఫైలింగ్ అంశాలను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డిజైన్ ఫైలింగ్, పేటెంట్స్ పొందే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఈసీఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లోని పోస్టులు భర్తీ చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథ పాలకుల ఉద్యోగాలకు న్యాయస్థానం అనుమతి ఇచ్చిన నేపథ్యంలో భర్తీకి చర్యలు తీసుకోవాలని గోదావరి లైబ్రరీ అసోషియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కె.సాయిబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రంథాలయ శాస్త్రంలో పీహెచ్‌డీలు సైతం చేసిన వారు ఉన్నారని, విద్యాసంస్థలు, గ్రంథాలయాలు తదితర వాటిలో ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులను అదుకోవాలని కోరారు.

విపత్తుల నివారణపై రేపు మాక్‌డ్రిల్

- డీఆర్వో శ్రీధర్‌రెడ్డి
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష



రసాయనిక విపత్తుల నియంత్రణ సంసిద్ధతపై మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్‌రెడ్డి

కాకినాడ సిటీ: స్థానిక కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కర్మాగారం ఆవరణలో గురువారం పారిశ్రామిక విపత్తుల నివారణ, నియంత్రణపై నిర్వహించనున్న మాక్‌డ్రిల్‌లో తమ సంసిద్ధతా ప్రణాళికల అమలును సమర్థవంతంగా ప్రదర్శించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి వివిధ ప్రభుత్వ శాఖలు, పారిశ్రామిక సంస్థలను కోరారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర విపత్తుల నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల్లో పరిశ్రమలలో రసాయనిక విపత్తుల నియంత్రణ సంసిద్ధతపై టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ ప్రతినిధులతో కలసి పాల్గొన్నారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి రాధాకృష్ణ మాట్లాడుతూ గురువారం కాకినాడ తీరంలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థలో అమ్మోనియా వాయువు లీకేజీ విపత్తు నియంత్రణపై నిర్వహించనున్న మాక్ డ్రిల్‌పై రాష్ట్ర అధికారులకు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మిటిగేషన్ అంశాలతో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. కలెక్టర్ నేతృత్వంలో పరిశ్రమలు, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, రవాణా, మున్సిపల్, పర్యావరణ, వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య, వ్యవసాయ, సమాచార శాఖల అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సిబ్బంది, వివిధ పరిశ్రమల భద్రతా సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రాధాకృష్ణ వివరించారు. డీఆర్వో శ్రీధర్‌రెడ్డి అధికారులు, పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతూ మాక్‌డ్రిల్‌లో పరిశీలించిన అంశాల ఆధారంగా మరింత పటిష్టమైన విపత్తుల నివారణ, నియంత్రణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రైసిస్ గ్రూప్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతృభాష పరిరక్షణ ఎంతో అవసరం



విజయవాడ సిదార్థ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యం



తెలుగు ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

బాలాజీచెరువు: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం పేర్కొన్నారు. ఆ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతూ ఉపాధి అవసరాల కోసం ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషపై ప్రేమ తగ్గకూడదన్నారు. ప్రముఖ సాహిత్య ఇతిహాసకులు బొల్లోజు బాబా మాట్లాడుతూ 1999లో బంగ్లాదేశ్‌లో జరిగిన భాషా ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులను యూఎన్‌ఓ గుర్తించి ప్రతి ఏడాది ఫిబ్రవరి 21న ప్రపంచ మాతృభాషా దితోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, జానపద నృత్యం, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విజయవాడకు చెందిన సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యం ప్రథమ స్థానం సాధించింది. ఈ కార్యక్రమంలో శ్రీవత్స రామకృష్ణ, కళాశాల పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షులు కర్రి భామిరెడ్డి, హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్, అధ్యాపకులు కృష్ణారావు, సుజాత, ఆశీర్వాదం, నాగేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయులకు సత్కారం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ తెలుగు ఉపాధ్యాయులు కె.కృష్ణకుమారీ, షేక్ కరీమున్నీసా, ఎం.రామలక్ష్మి, పి.జగదీశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతృ భాష మాధుర్యాన్ని గుర్తించాలన్నారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

కనికట్టు కాదు.. కవలలే..



పులపకూర ఇషిత, ఇన్విత, పాతర్లగడ్డ



రెడ్డి ఆదిత్య, అక్షయ, కరప



పోలిశెట్టి దీక్షితా రమ్య, దీపికా లల్లీ, కరప

- రూపం ఒకటైనా.. తనువులు వేరు..
- నేడు కవలల దినోత్సవం

కరప: కవల పిల్లలంటే వారిని గుర్తించడంలో తల్లిదండ్రులకూ తికమకే. ఎవరు పెద్దో, ఎవరు చిన్నో, ఏ పేరు ఎవరితో గుర్తించలేని అయోమయం. చిన్నారులే వారంత వారు చెబితే తప్ప గుర్తించలేని పరిస్థితి. బుధవారం కవలల దినోత్సవం సందర్భంగా కరప మండలం పాతర్లగడ్డ గ్రామానికి చెందిన పులపకూర వెంకటరమణ, ఝాన్సీరాణి ఉపాధ్యాయ దంపతులు బుధవారం కవలల దినోత్సవం సందర్భంగా వారి మూడేళ్ల చిన్నారులు ఇషిత, ఇన్వితలను చూడముచ్చటగా అలంకరించారు. ఇక కరప గ్రామానికి చెందిన రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, సూర్యకుమారి దంపతులకు ఆదిత్య, అక్షయలు కవలపిల్లలు, రూపంలో ఒకేలా ఉన్నా ఆడ, మగ కావడంతో కొంతవరకు తికమకలేకుండా గుర్తుపడతారు కానీ, ఒకేవిధంగా అలంకరిస్తే మాత్రం గుర్తుపట్టటం కష్టమే.

అలాగే ఈ గ్రామానికే చెందిన పోలిశెట్టి గణేష్, సూర్యవతి దంపతులకు దీక్షితా రమ్య, దీపికా లల్లీ కవల పిల్లలు. వీరినిచూసి ఒక్కొక్కసారి తల్లిదండ్రులే తికమక పడుతుంటారు. పాఠశాలలో అయితే ఉపాధ్యాయులకు వీరిని చూస్తే ఎప్పుడూ అయోమయమే.

ఆధ్యాత్మిక పాదయాత్రతో జీవశక్తి



గురుస్వామి వీరవెంకట సుబ్బారావును సత్కరిస్తున్న రమణరాజు

బోట్‌క్లబ్: ఆధ్యాత్మిక పాదయాత్ర జీవశక్తిని ప్రసాదిస్తుందని భద్రాచల పాదయాత్రికుల గురుస్వామి ఉంగరాల వీరవెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక భోగి గణపతిపీఠంలో మంగళవారం సుబ్బారావు గురుస్వామిని పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు సత్కరించారు. గత 12 ఏళ్లుగా పాదయాత్ర చేసి భద్రచలంతో శ్రీరాముని దర్శించుకుంటున్నామన్నారు. అలాగే గత 13 ఏళ్లుగా రూ. 11 లక్షలతో నిర్మించిన శ్రీరామ రథంతో ఏటా 300 మంది భక్తులతో పాదయాత్ర చేస్తున్నామన్నారు. అనంతరం గురుస్వామిని సత్కరించి, ఆధ్యాత్మిక గ్రంథాన్ని సమర్పించారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో ఆకట్టుకొంటున్న కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు



ప్రదర్శన, విక్రయాలకు ఉంచిన కలంకారి చీరలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని లేపాక్షి షోరూం పక్కన ఏర్పాటు చేసిన హస్తకళలు, చేనేత వస్త్ర ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో ఉంచిన కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, ఆర్టిఫీషియల్ జ్యుయలరీ, మెటల్ కాస్టింగ్, బొబ్బిలి వీణలు, కళంకారీ పెయింటింగ్స్, మదనపల్లి పాటరీ, జ్యూట్ బ్యాగ్‌లు, షారోన్‌పూర్ వుడ్ కార్వింగ్, లెదర్‌వేర్, ఉలెన్ కార్పెట్, సిరామిక్ ఐటమ్స్, హైదరాబాద్ పెరల్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, ధర్మవరం, సిద్దిపేట్, నారాయణపేట, చీరాల, నారాయణవరం, గాగ్రా చోళీ, ఖాదీ మెటీరియల్, బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయని లేపాక్షి మేనేజర్ వీరబాబు తెలిపారు. ఈ నెల 26 రాత్రి 9 గంటలు వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డ్రగ్ స్టోర్ నిర్వహణ పరిశీలన

- ఖరీదైన మందులు, రికార్డుల తనిఖీ
- సిబ్బందికి ఎంఎస్ఐడీసీ జీఎం సురేష్ అభినందన



అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ సురేష్

కాకినాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) జనరల్ మేనేజర్ డాక్టర్ కె.సురేష్ మంగళవారం కాకినాడకు వచ్చారు. కాకినాడ వార్ఫ్‌రోడ్డులో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీఎస్)ను సందర్శించారు. మందుల వినియోగం, నిర్వహణను పరిశీలించారు. ఖరీదైన మందులు, భద్రపరిచిన తీరు, వాటిని రోగులకు అందజేస్తూ రికార్డుల నిర్వహణను పర్యవేక్షించారు. భారీ స్థాయిలో ఉన్న మందుల నిల్వల నిర్వహణను అప్రమత్తంగా చేపడుతున్న సీడీఎస్ సిబ్బందిని డాక్టర్ సురేష్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం రామారావు పేట అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ ఓపీ నిర్వహణ, ఎల్రక్టానిక్ హెల్త్ రికార్డు(ఈహెచ్ఆర్)ను పరిశీలించారు. నగరంలో ఆయన పర్యటన సాయంత్రం వరకు కొనసాగింది.

చెత్తను విభజించి ఇవ్వండి

అదనపు కమిషనర్ నాగ నరసింహారావు



పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు మంగళవారం పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఒకటో సర్కిల్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, రమణయ్యపేట పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి–పొడి చెత్తను వేరువేరుగా విభజించి మాత్రమే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని స్పష్టం చేశారు. చెత్తను రోడ్ల పైన, డ్రైనేజీలలోను వేయొద్దని కోరారు. అలా వేస్తే జరిమానా విధించడంతో పాటు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమని ఆయన అన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

చెత్త పన్ను రద్దు చేయాలి

బాలాజీచెరువు: చెత్తపన్ను రద్దు చేసి పేద ప్రజల ఆర్థిక భారం తగ్గించాలని జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్ పేర్కొన్నారు. మన ప్రాంతం–మన సచివాలయంలో భాగంగా 25వ వార్డు సచివాలయం పరిధిలో ఆ పార్టీ నాయకులతో ఆయన పర్యటించారు.

నేత్రపర్వం భీమేశ్వరుని శ్రీపుష్పయాగోత్సవం



శ్రీపుష్పయాగోత్సవంలో ఊయలలో ఓలలాడుతున్న అయ్యవారు, అమ్మవారు



కార్యక్రమానికి హాజరైన భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి శ్రీపుష్పయాగోత్సవం మంగళవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. ఈ మేరకు అమ్మవారి అలయాన్ని పూలతో అలంకరణ చేశారు. ఈనెల 16న స్వామి వారి కల్యాణం, 18న రథోత్సవం, 20న త్రిశూల స్నానం జరిగాయి. కల్యాణ ఉత్సవాలు ముగింపులో భాగంగా శ్రీపుష్ప యాగోత్సవాన్ని వేద మంత్రాల మధ్య కల్యాణ వేదికపై స్వామి వారికి అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయంలో పూలతో, వివిధ రకాల పండ్లు, మిఠాయిలతో అలంకరించి ఊయలలో స్వామి వారి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచారు. ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు దంపతులు, ఈఓ డి నాగమల్లేశ్వరరావు దంపతులతో పాటు ట్రస్టుబోర్డు సభ్యుల దంపతులకు దంపత తాంబూలాలు అందజేశారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో బారులుతీరారు. శ్రీపుష్పయాగోత్సవాన్ని తిలకించిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు, భక్త సంఘం నాయకులు బిక్కిన సాయిపరమేశ్వరరావు, గంజి బూరయ్య, తలుపుల అంజనీ కుమార్, చల్లా సత్తిబాబు, బీవీ రమణ భక్తులకు సేవలందించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, చెరుకూరి భీమన్న, శ్రీకాకుళపు వినయ్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.